## క్లుప్తంగా

### సైకత శిల్పిపై దాడి

ఆమదాలవలస: మండలంలోని గాజులకొల్లివలస గ్రామ సమీపంలో గల సంగమేశ్వర స్వామి కొండ ప్రాంతంలో నివాసం ఉంటున్న సైకత శిల్పి గేదెల హరికృష్ణపై శనివారం కొంత మంది వ్యక్తులు దాడి చేశారు. తనపై ఆర్‌ఆర్ కాలనీకి చెందిన వ్యక్తులు అకారణంగా దాడి చేశారని ఆమదాలవలస పోలీసులకు హరికృష్ణ ఫిర్యాదు చేశారు. ఓ చానల్ వాళ్లు వచ్చి సంగమేశ్వరస్వామి కొండపై స్టోరీ కోసం వివరాలు అడిగితే తెలియజేశానన్నారు. వారికి ఇక్కడి వివరాలు ఎందుకు తెలియజేశావని, కొండ కోసం చెప్పాల్సిన అవసరం ఏముందని తనపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్‌ఐ ఎస్.బాలరాజు తెలిపారు.

### బాధ్యతల స్వీకరణ

పాతపట్నం: పాతపట్నం ఉప ఖజానాధికారి ఎఫ్‌ఏసీగా సోంపేట ఉప ఖజానాధికారి ఎం.రమేష్ నాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఉప ఖజానాధికారి ఎం.భాగ్యలక్ష్మి ఉద్యోగోన్నతిపై అసిస్టెంట్ ఆడిట్ అధికారిగా శ్రీకాకుళం ఎక్సైజ్ సూపరిటెండెంట్ కార్యాలయానికి వెళ్లారు. రమేష్ నాయుడుకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

### ఏపీఎంసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సుధాకర్



ఆమదాలవలస: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ చాపర సుధాకర్ ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు ఏపీ మెడికల్ కౌన్సిల్ కార్యాలయం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ సుధాకర్‌కు పలువురు అభినందనలు తెలియజేశారు.

### ట్రాక్టర్ తొట్టె తగిలి వ్యక్తికి గాయాలు

సారవకోట: మండలంలోని అలుదు గ్రామానికి చెందిన పంగ సింహాచలంకు ట్రాక్టర్ తొట్టె తగలడంతో గాయాలయ్యాయి. ఈ ప్రమాదం శనివారం జరిగింది. ట్రాక్టర్‌పై కూలి పనులకు వెళ్లారు. లోడు దించిన తరువాత కిందకు దిగిన సమయంలో ట్రాక్టర్ తొట్టె ఢీకొనడంతో గాయాల పాలయ్యాడు. 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. దీనిపై సింహాచలం భార్య బొడెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సారవకోట ఎస్‌ఐ అనీల్ కుమార్ కేసు నమోదు చేశారు.

### రూ.30 వేల ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

హిరమండలం: స్థానిక సుభలయ ఆర్‌అండ్‌ఆర్ దావీదుపురం ఒకటో వీధికి చెందిన మూగయ్య, జడ్డమ్మ కుటుంబం పేదరికంతో బాధపడుతోంది. వీరి పిల్లలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్‌ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు స్వరాజ్, జాన్సన్ రూ.30 వేల నగదును శనివారం ఆ కుటుంబానికి అందించారు. భవిష్యత్‌లో సైతం అండగా నిలుస్తామన్నారు.

### 12 మంది జూదరుల అరెస్ట్

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ, బూర్జ మండలాల్లో జూదం ఆడుతూ 12 మంది పట్టుబడ్డారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి బొడ్డేపల్లిపేట గ్రామ శివార్లలోని మామిడితోటలో జూద శిబిరంపై ఆమదాలవలస ఎస్‌ఐ–3 సీపాన కాంతారావు తన సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం దాడి చేశారు. 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8,750 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఓ.వి.పేటలో..

బూర్జ: మండలంలోని ఓ.వి.పేట గ్రామ రచ్చబండ దగ్గర నలుగురు జూదరులను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వారివద్ద రూ.7720 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక తెలిపారు.

### ప్రభుత్వ పాఠశాలల పరిశీలన

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని టెక్కలి డిప్యూటీ ఈఓ విలియన్స్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత, కోరాడ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శనివారం తనిఖీ చేశారు. రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. హెచ్ఎం టి.కేశవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఎరువుల పంపిణీ

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని కరకవలస, హిరమండలం మండలంలోని అంబవల్లి రైతు సేవా కేంద్రాల్లో చేపట్టిన ఎరువుల పంపిణీని కొత్తూరు డివిజన్ వ్యవసాయశాఖ ఏడీఏ రాజగోపాల్ శనివారం పరిశీలించారు. రైతులకు రెండో విడత కూడా ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవద్దన్నారు. హిరమండలం తహసీల్దార్ హనుమంతురావు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షా కాలంలో జాగ్రత్త..



తురకపేటలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

- పరిసరాలు అపరిశుభ్రం
- అధికంగా దోమలు వృద్ధి
- ప్రబలుతున్న అంటువ్యాధులు

సరుబుజ్జిలి: వర్షాకాలం ప్రారంభం అయిందంటే వాతావరణం కలుషితమై పలు రకాల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముంది. పరిసరాల పరిశుభ్రం విషయంలో ఏమాత్రం ఏమరపాటు వహించినా.. భారీ మూల్యం చెల్లించుకోకతప్పదు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పలుమార్లు హెచ్చరిస్తున్నా.. స్థానికంగా జాగ్రత్తలు తీసుకోకపోవడం వలన పలు రకాల వ్యాధులకు ప్రజలు గురవుతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, పొందూరు, ఆమదాలవలస రూరల్, పట్టణం, బూర్జ మండలాల్లో విపరీతమైన వర్షాలు కురవడం వలన ఎక్కడబడితే అక్కడ మురుగునీరు నిల్వ ఉంటుంది. ఆవాసాలు పరిశుభ్రం విషయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకొంటే చికెన్ గున్యా, డెంగీ, డయేరియా వంటి అంటు వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు.

**వర్షా కాలంలో విజృంభించే వ్యాధులు..**

**డయేరియా..**

కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వలన డయేరియా వ్యాపిస్తుంది. తరచూ నీళ్ల విరోచనాలు వస్తాయి. నీరసం, అతి దాహంగా ఉంటుంది.

**చికెన్ గున్యా..**

చికెన్ గున్యా వైరస్‌లో కలిసి ఈడిస్ దోమ కుట్టడం వలన వ్యాపిస్తుంది. దోమ కుట్టిన తరువాత 3 నుంచి 12 వారాలు లోపు జ్వరం వస్తుంది. తలనొప్పి, వాంతులు, వికారం, హటాత్తుగా జ్వరం రావడం ఈ వ్యాధి లక్షణాలు. శరీరంలో అన్ని కీళ్లపై దీని ప్రభావం ఉంటుంది.

**మలేరియా..**

మలేరియా ప్లాస్మోడియం అనే పరాన్న జీవి వలన వ్యాపిస్తుంది. ఈ వ్యాధి ఆడ ఎనాఫిలిస్ దోమ కుట్టడం వలన వ్యాపిస్తుంది. ఈ దోమలు మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఉండి వ్యాధిని తీవ్రతరం చేస్తాయి. ఈ దోమ కుట్టిన తరువాత 7 నుంచి 10 రోజుల్లో చలి, వణుకు, వళ్లు నొప్పిలతో కూడిన జ్వరం విడిచి వస్తుంది.

**డెంగీ జ్వరం..**

అన్నింటికంటే ప్రాణాంతకమైన వ్యాధి డెంగీ. టైగర్ అనబడే దోమలు పగటిపూట మాత్రమే కుడతాయి. దీనివలన జ్వరంతో పాటు శరీరంపై ఎర్రటి మచ్చలు, దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తస్రావం జరుగుతుంది.

**మెదడు వాపు..**

మెదడు వాపు చిన్ని పిల్లల్లో అధికంగా వస్తుంది. ఈ వ్యాధి వలన కళ్లు తిరగడం. రోగి కోమాలోకి వెళ్లడం జరుగుతుంది. పందులకు కుట్టిన దోమలు మనుషులకు కుట్టడం వలన వ్యాపిస్తుంది. అధికంగా పందులు సంచారం ఉన్న ప్రాంతాల్లో వైరస్ వ్యాప్తి ఉంటుంది.

**పాటించాల్సిన జాగ్రత్తలు..**

- ఆవాసాలు ముందు చెత్త, పెంటకుప్పలు, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలి.
- కొబ్బరి బొండాల చిప్పలు, పాతటైర్లు, పూలకుండీలు లేకుండా చూడాలి.
- భోజనం ముందు, మలమూత్ర విసర్జన సమయాల్లో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవాలి.
- కలుషిత నీటికి, ఆహార పదార్థాలకు దూరంగా ఉంటూ వేడి పదార్థాలను తీసుకోవాలి, కాచిచల్లార్చిన నీటిని తాగాలి.

#### జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాలు కురిసిన వెంటనే వాతావరణంలో మార్పులు ఏర్పడి అంటు వ్యాధులు ప్రబలుతాయి. ఇప్పటికే గ్రామాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేశాం. క్లోరినేషన్ పనులు చేస్తున్నాం. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

– బమ్మిడి జ్యోతిర్మయి, వైద్యాధికారి, పురుషోత్తపురం పీహెచ్‌సీ, సరుబుజ్జిలి మండలం

#### పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి



పారిశుద్ధ్యం విషయంలో ఇబ్బందులు వస్తున్నాయి. మురగునీటి కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేశారు. దీనివలన మురగునీరు రోడ్లపై నిల్వ చేరి దోమలు, ఈగలు వాలుతున్నాయి. వర్షం పడితే నీరు నిల్వ చేరి అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి.

– ఇల్లాకులు శ్రీనివాసరావు, నందికొండ, సరుబుజ్జిలి మండలం

#### ముందస్తు చర్యలు తీసుకోవాలి



గ్రామాల్లో అధికారులు ముందస్తు ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టాలి. ప్రధానంగా రక్షిత మంచినీటి పథకాలు, మురుగు కాలువలను శుభ్రం చేయాలి. వీధుల్లో చెత్త కుప్పలను తొలగించి, బోర్లు, నేలబావుల వద్ద క్లోరినేషన్ చేయాలి.

– పైడి మోహన్‌రావు, మతలబుపేట, సరుబుజ్జిలి మండలం

# ప్రభుత్వ ఆస్తులను రక్షించండి



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- చెరువుల ఆక్రమణలు తొలగించండి
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నరసన్నపేట: మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలను కాపాడాలని, చెరువుల ఆక్రమణలను సమన్వయంతో అరికట్టాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నియోజకవర్గ స్థాయి సమస్యలపై శనివారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. చెరువులు ఆక్రమణలకు గురి అవుతుంటే ఇరిగేషన్ అధికారులు ఏమి చేస్తున్నారు.. చెరువులను పరిరక్షించాలి కదా అని ప్రశ్నించారు. రెవెన్యూ, పంచాయతీ అధికారుల సహకారంతో చెరువుల్లో ఆక్రమణలను అరికట్టాలని, ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. చెరువుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలన్నారు. రైతు బజారు ఏర్పాటు, రాజుల చెరువు సుందరీకరణ, కాలేజీ రోడ్డు అభివృద్ధి, భూగర్భ డ్రైనేజీ పనులు, ఇండోర్ స్టేడియం పనుల పురోగతి, ఎర్రంనాయుడు పార్క్ పనులు, ఇళ్ల స్థలాలు కేటాయింపు కోసం స్థల పరిశీలన, బొంతు ఎత్తిపోతల పథకం అభివృద్ధి పనులు, వనిత మండలం వద్ద వంశధార కాలువపై నిర్మాణంలో ఉన్న వంతెన పనులపై ఆరా తీశారు. సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. వనిత మండలం వంతెన పనులు పూర్తి చేయాలని, ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలని ఆర్డీఓ సాయి ప్రత్యూషకు ఆదేశించారు. మడపాం, కామేశ్వరిపేట ఎత్తిపోతల పథకాల డీపీఆర్ గురించి ఆరా తీశారు. నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్, ఉపాధి పనులు తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా పరిసరాలను సుందరీకరించాలని ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లకు ఆదేశించారు. వంశధార కాలువల పరిస్థితి, ఇంతవరకు జరిగిన పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. వంశధార నదికి ఆనుకొని వరద కట్టల నిర్మాణంపై సంబంధిత ఇంజినీర్లను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఇళ్ల నిర్మాణం, ఎరువుల పంపిణీపై పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. నరసన్నపేట ప్రజలకు తాగునీరు అందించేందుకు గొట్టా బ్యారేజీ నుంచి నీటిని తీసుకురావాల్సిన అవసరం ఉందని కలెక్టర్‌కు వివరించారు. వరద కట్టలు నిర్మించాలని, జల్ జీవన్ పనులు పూర్తి చేయించాలని, వంశధార కాలువలను ఆధునీకరించాలని, రైతు బజారు ఏర్పాటు చేయాలని, ఇండోర్ స్టేడియం పనులు తొందరగా పూర్తిచేయాలని కలెక్టర్‌ను కోరారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీకుమార్, శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీఓలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రసాద్, ఈఆర్‌ఓ జయదేవి, వివిధ శాఖలకు చెందిన జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# తెలుపు రేషన్ కార్డు రైతులకు మొక్కలు ఉచితం

- పాతపట్నం రేంజర్ అమ్మన్నాయుడు



అంతరాబ నర్సరీని పరిశీలిస్తున్న ఫారెస్ట్ రేంజర్ అమ్మన్నాయుడు

పాతపట్నం: పర్యావరణ పరిరక్షణకు అటవీశాఖ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ఈ ఏడాది అంతరాబ నర్సరీ, కొత్తపేట నర్సీల ద్వారా లక్షలాది మొక్కలను రైతులకు ఉచితంగా అందజేస్తామని పాతపట్నం ఫారెస్ట్ రేంజర్ పి.అమ్మన్నాయుడు అన్నారు. అంతరాబ నర్సరీని సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. రైతులు, ప్రభుత్వ శాఖలకు ఉచితంగా మొక్కలు అందిస్తామన్నారు. పాతపట్నం మండలంలోని అంతరాబ నర్సరీ, సారవకోట మండలంలోని కొత్తపేట వద్ద నర్సరీలు ఉన్నాయని, పంపిణీకి మొక్కలు సిద్ధం చేశామన్నారు. టేకు, ఇరిడి (రోజ్‌వుడ్), జామ, జమ్మి, నేరేడు, కానుగ, నెమలినార, ఏగిస, బాదం, నల్లమద్ది, మునగ, రెల్ల, గుమ్మడి టేకు, సీతాఫలం, తదితర రకాల మొక్కలు రెండు నర్సీల్లోనూ అందుబాటులో ఉన్నాయన్నారు. మొక్కలు కావాల్సిన రైతులు ఆధార్, ఫోన్ నంబర్, తెలుపు రేషన్ కార్డు, ఒన్‌-బీ వివరాలు అందించాలన్నారు. పూర్తి వివరాలకు అంతరాబ నర్సరీ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎం.అజయ్ ఫోన్ 70954 91536, కొత్తకోట నర్సరీ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఫోన్ 79894 23692 నంబర్లను సంప్రదించాలన్నారు.

# మోడల్ కిచెన్ నిర్మాణానికి చర్యలు

- అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్



గురుకులం అధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్

బూర్జ: మండలంలోని కొల్లివలసలో గల డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో మోడల్ (డార్మెట్రి) కిచెన్ రూమ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ డార్మెట్రి, వంట గదిని పరిశీలించి, విద్యార్థులు భోజనాలు చేసిన సమయంలో పడుతున్న సమస్యలను గుర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సంయుక్త కలెక్టర్ శనివారం గురుకులాన్ని పరిశీలించారు. శ్రీకాకుళం అక్షయ ఫౌండేషన్, హరేకృష్ణ వారి ఆర్థిక సహాయంతో మోడల్ డార్మెట్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు తయారు చేసిన ప్రతిపాదిత అంచనాలతో త్వరగా వంటగది, విద్యార్థుల డార్మెట్రిని నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా గురుకులాల సంక్షేమ సమన్వయకర్త జి.గ్రేస్, సోషల్ వెల్ఫేర్ డీడీ కె.సురేష్, ఆమదాలవలస సర్వశిక్ష అభియాన్ ఏఈ సాయిరాం, గురుకులం ప్రిన్సిపాల్ బి.రాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మణరావు పాల్గొన్నారు.

# శాశ్వత వలస ఓట్లు తొలగించాలి



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ జయదేవి

నరసన్నపేట: నియోజకవర్గంలో అనేక మంది ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలసవెళ్లారని, వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగుతున్నాయని, అటువంటి పేర్లు తొలగించాలని ఈఆర్‌ఓ జయదేవికి నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్‌సీపీ నరసన్నపేట, పోలాకి మండలాల అధ్యక్షులు లుకలాపు రవి, కణితి కృష్ణారావు కోరారు. నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితాపై ఈఆర్‌ఓ సమీక్ష నిర్వహించారు. వివాహాలు చేసుకొని ఏళ్ల క్రితమే అత్త వారింటికి వెళ్లినవారి పేర్లు ఇంకా కొనసాగుతున్నాయని ఈఆర్‌ఓ దృష్టికి వైఎస్సార్‌సీపీ నాయకులు తీసుకెళ్లారు. నరసన్నపేట పరిధిలోని 16, 17, 18వ వార్డుల్లో ఉన్న కుటుంబ సభ్యుల పేర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్నాయని, అటువంటివి గుర్తించి ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోనికి తీసుకురావాలని కోరారు. వీటిపై ఈఆర్‌ఓ సానుకూలంగా స్పందించారు. శాశ్వత వలసదారుల పేర్లు, అత్తవారింటికి వెళ్లినవారి పేర్లు తెలియజేయాలని సూచించారు. ఇచ్చిన జాబితా ప్రకారం పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్ల జాబితాలో ఇతర సమస్యలు, పోలింగ్ కేంద్రాల సమస్యలు ఉంటే సూచించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఈఆర్‌ఓ కోరారు.

ఈ సమావేశంలో తహసీల్దార్లు టి.సత్యనారాయణ, జెన్ని రామారావు, వైఎస్సార్‌సీపీ తరఫున కణుసు సీతారాం, బుడ్డల రాజశేఖర్, ముద్దాడ బైరాగినాయుడు, కనలప శేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన శిక్షణ



బీజామృతం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నరసన్నపేట: ప్రకృతి వ్యవసాయంపై నరసన్నపేట నియోజకవర్గంలోని నరసన్నపేట, పోలాకి మండలాల వీఏఏలు, వీహెచ్ఏలకు రెండు రోజులుగా ఇస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. చివరిరోజు దేవాదిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ఎన్ఎఫ్ఏ గోవిందరెడ్డి, మాస్టర్ ట్రైనీ రమణ ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. ఘన, ద్రవ, బీజామృతం, నీమాస్త్రం తయారీపై అవగాహన కల్పించారు. నవధాన్యాల ఆవశ్యకతను తెలియజేశారు. వీటిని గ్రామాల్లో రైతులకు వివరించి ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచాలన్నారు.

### విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నరసన్నపేట: విద్యుత్ వినియోగదారులకు భారంగా ఉన్న సర్దుబాటు చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఐ, పలు ప్రజా సంఘాల నాయకులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో శనివారం నరసన్నపేటలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పేదలపై విద్యుత్ సర్దుబాటు చార్జీల భారం అధికంగా ఉందన్నారు. వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ కాలంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటుపై కూటమి నాయకులు ఆందోళనలు చేశారని, ఇప్పుడు ఈ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు మరింత పక్కాగా నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఆగస్టు 5వ తేదీన మరోసారి మండల కేంద్రాల్లో పెంచిన సర్దుబాటు చార్జీల రద్దు, స్మార్ట్ మీటర్లు ఏర్పాటును విరమించుకోవాలని కోరుతూ ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు కొర్ను లచ్చయ్య, లవ కుమార్, భాస్కరరావు, కర్ణ వీరుడు, అప్పారావు, తిరుపతి, వసంతరావు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సారవకోట: మండలంలోని జగ్గయ్యపేట సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మండలం పెద్దబమ్మిడి గ్రామానికి చెందిన శ్రీరామ్ గాయాలపాలయ్యాడు. పాతపట్నం నుంచి సారవకోట వైపు ద్విచక్ర వాహనంపై శ్రీరామ్ వెళ్తున్నాడు. ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనున్న రైలింగ్‌ను ఢీకొట్టాడు. రోడ్డుపై పడి ఉన్న శ్రీరామ్‌ను అటుగా వెళ్తున్నవారు గుర్తించి హైవే అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. శ్రీరామ్ తండ్రి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ విజయభాస్కర్ శనివారం కేసు నమోదు చేశారు.



ఆమదాలవలస: కొత్త కంద్రపేటలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు





ఆమదాలవలస: నందగిరిపేటలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ నాయకులు



పోలాకి: పల్లిపేటలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

# కూటమి పాలన మోసాలమయం

ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పలు మండలాలకు చెందిన పార్టీ నాయకులు అన్నారు. మెళియాపుట్టి మండలంలోని హడ్డివాడ గిరిజన గ్రామంలో రెడ్డి శాంతి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 18వ వార్డు కొత్తకంద్రపేట, బొడ్డేపల్లిపేట తదితర ప్రాంతాల్లో పార్టీ నాయకులు మామిడి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చింతాడ రవికుమార్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్ హాజరయ్యారు. నరసన్నపేట మండలంలోని గొట్టిపల్లి పంచాయతీలో ఎంపీపీ ఆరంగి మురళి ఆధ్వర్యంలో, పోలాకి మండలంలోని సంతలక్ష్మీపురం, పల్లిపేట గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు ఆధ్వర్యంలో, సారవకోట మండలంలోని మాళువ, నౌతళ, ధర్మలక్ష్మీపురం పంచాయతీలలో డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో, జలుమూరు మండలంలోని అంధవరం, పర్లాం, మాకివలస గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ వాన గోపి, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, జిల్లా కార్యదర్శి మొజ్జాడ శ్యామలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జిల్లా, నియోజకవర్గ, మండలానికి చెందిన నాయకులు, పార్టీ శ్రేణులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మెళియాపుట్టి: హడ్డివాడలో కూటమి వైఫల్యాలను వివరిస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



నరసన్నపేట: గొట్టిపల్లిలో క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న ఎంపీపీ ఆరంగి మురళి, నాయకులు



జలుమూరు: పర్లాంలో క్యూ ఆర్ కోడ్‌ను చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సారవకోట: సవర మాళువలో క్యూఆర్ కోడ్‌లను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు